

## ఈ మార్పు అందుకోసమేనా?

'భగవంత్ కేసరి'తో భారీ విజయాన్ని అందుకున్న బాలకృష్ణ తన తదుపరి సినిమాకు సంబంధించిన పనుల్లో బిజీ అయిపోయారు. ఎన్‌బీకే 109గా రాబోతున్న ఈ చిత్రానికి కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్‌కేసరి చిత్రాల్లో పూర్తి గడ్డంతో కనిపించిన బాలయ్య, ఈ సినిమా కోసం క్లీన్ షేవ్ చేసుకొని నీట్‌గా తయారయ్యారు. బాబీ సినిమా కోసమే ఆయన అలా మారినట్టు సమాచారం. ఇందులో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్న హీరోల్లో బాలయ్య చేసినన్ని ద్విపాత్రాభినయాలు ఏ హీరో చేయలేదన్నది యథార్థం. రీసెంట్‌గా చేస్తున్న బాబీ సినిమాలో కూడా ఆయన ఇద్దరుగా కనిపించబోతున్నారట. ఇందులోని ఓ పాత్ర మధ్య తరగతి ఫ్యామిలీమేన్ తరహా పాత్రయితే, మరో పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందని తెలుస్తున్నది. ఈ సినిమాను కూడా ఘన విజయం చేసి, బాలకృష్ణను డబుల్ హ్యాట్రిక్ వైపుకు నడిపించడానికి బాబీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగవంశీ నిర్మిస్తున్నారు.



## ఆనాటి రోజులు గుర్తుకొచ్చాయి

అగ్ర హీరో చిరంజీవి నటించిన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' చిత్రం చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రాన్ని మెగా ప్రొడక్షన్స్ సంస్థ నవంబర్ 4న రీరిలీజ్ చేస్తున్నది. గురువారం చిత్ర ట్రైలర్‌ను నాగబాబు, హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. సినిమా చూస్తుంటే నాటి రోజులు గుర్తుకొచ్చాయని, ఎన్ని ఓటీటీ ఛానల్స్ ఉన్నా ఇలాంటి చిత్రాలను థియేటర్‌లోనే ఎక్స్‌పీరియన్స్ చేయాలని నాగబాబు తెలిపారు. ఈ సినిమాలో తాను పోషించిన ఏటీఎం పాత్ర అందరికి గుర్తుండిపోయిందని, ఇప్పటికీ కొందరు అదే పేరుతో పిలుస్తుంటారని శ్రీకాంత్ అన్నారు. ఈ చిత్రాన్ని తాను పశ్చిమ గోదావరి ఏరియాలో డిస్ట్రిబ్యూట్ చేశానని, ఆ టైంలో మంచి లాభాలను తెచ్చిపెట్టిందని సురేష్ కొండేటి పేర్కొన్నారు.

## క్రీడాకారుడి యథార్థగాథ



విజయరామరాజు

1980లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన కబడ్డీ ఆటగాడు అర్జున్ చక్రవర్తి నిజజీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'అర్జున్ చక్రవర్తి – జర్నీ ఆఫ్ యాన్ అన్‌సంగ్ ఛాంపియన్'. విజయరామరాజు, సిజా రోజ్ ప్రధాన పాత్రధారులు. విక్రాంత్ రుద్ర దర్శకుడు. శ్రీని గుబ్బల నిర్మాత. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. '1980లో భారత క్రికెట్‌పై కపిల్ దేవ్ ప్రభావం ఏ స్థాయిలో ఉండేదో అర్జున్ చక్రవర్తి ప్రభావం అప్పటి భారత కబడ్డీపై అంతగా ఉండేది' అంటూ ఫస్ట్‌లుక్‌లో రాసిన అక్షరాలు సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని, క్రీడాకారుడి పాత్ర కావడంచేత భారీ కసరత్తులతో తన శరీరాన్ని విజయరామరాజు ధృఢంగా మలుచుకున్నాడని, 'అర్జున్‌చక్రవర్తి' ఓ స్ఫూర్తిదాయక ప్రయాణమని, సాంకేతికంగా కూడా అద్భుతంగా ఉంటుందని నిర్మాత చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుందని దర్శకుడు తెలిపారు.




## 36 ఏండ్ల నిరీక్షణ

అగ్ర నటుడు కమల్‌హాసన్, దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకుడు' (1987) చిత్రం ఓ క్లాసిక్‌గా నిలిచిపోయింది. దాదాపు 36 ఏండ్ల విరామం తర్వాత వీరిద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రం శుక్రవారం చెన్నైలో ఘనంగా ప్రారంభమైంది. రాజ్‌కమల్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ పతాకాలపై కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు. 'ఇలాంటి శుభ తరుణం కోసం సినీ ప్రేమికులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దాదాపు 36 ఏండ్ల విరామం తర్వాత ఇద్దరు లెజెండ్స్ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రం చరిత్ర సృష్టిస్తుందన్న నమ్మకం ఉంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రవి కె చంద్రన్, యాక్షన్: అన్బరిన్, ఎడిటర్: శ్రీకర ప్రసాద్, సమర్పణ: ఉదయనిధి స్టాలిన్ రెడ్ జెయింట్ మూవీస్, రచన–దర్శకత్వం: మణిరత్నం.

## సస్పెన్స్ 'చిత్రం చూడరా'

వరుణ్‌సందేశ్, శీతల్‌భట్ జంటగా నటించిన సినిమా 'చిత్రం చూడర'. ఆర్.ఎన్ హర్షవర్ధన్ దర్శకుడు. శేషు మారంరెడ్డి, బోయపాటి భాగ్యలక్ష్మి నిర్మాతలు. ప్రముఖ నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ సస్పెన్స్, యాక్షన్ అంశాలతో ఆకట్టుకునేలావుందంటూ టీమ్‌కి విశ్వప్రసాద్ శుభాకాంక్షలు అందించారు. తనికెళ్ల భరణి, శివాజీరాజా, అల్లరి రవిబాబు, కాశీవిశ్వనాథ్, ధనరాజ్, రాజా రవీంద్ర, అన్నపూర్ణమ్మ, మీనాకుమారి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రథన్, కెమెరా: జవహర్‌రెడ్డి.



వరుణ్‌సందేశ్

## వాస్తు పాత్ర గుర్తింపు తెస్తుంది

'నాకు ఇష్టమైన దర్శకుల్లో తరుణ్‌భాస్కర్ ఒకరు. ఆయన సినిమాలు సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. ఆయన దర్శకత్వంతో వర్క్ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ సినిమాతో ఆ కోరిక తీరింది' అన్నారు నటుడు చైతన్య రావు. స్వీయ దర్శకత్వంలో తరుణ్‌భాస్కర్ నటిస్తున్న చిత్రం 'కీడా కోలా' నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో చైతన్యరావు వాస్తు అనే ప్రధాన పాత్రను పోషించారు. ఈ సందర్భంగా చైతన్యరావు మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను టూరెట్ సిండ్రోమ్‌తో బాధపడే వ్యక్తిగా కనిపిస్తా. నత్తి మాట్లాడటం, ఒక్కసారి మాటలు మధ్యలో ఆగిపోవడం ఈ సిండ్రోమ్ లక్షణాలు. ఈ పాత్ర కోసం చాలా కసరత్తులు చేశాను. చాలా సహజసిద్ధంగా నటించేందుకు ప్రయత్నించా. ఇందులో నా క్యారెక్టర్ పేరు వాస్తవ్. అయితే నత్తి సమస్య ఉంది కాబట్టి తన పేరును షార్ట్‌గా 'వాస్తు' అని చెబుతుంటాడు. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర అవుతుంది' అని చెప్పారు.



చైతన్యరావు

## సంగీత భరిత ప్రేమకథ

దిల్‌రాజు ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఆకాశం దాటి వస్తావా'. కొరియోగ్రాఫర్ యష్ హీరోగా పరిచయమవుతున్నాడు. శశి కుమార్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. కార్తీక మురళీధరన్ కథానాయిక. హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'శృంగార..' అనే పాటను శుక్రవారం విడుదల చేశారు. కార్తీక్ స్వరపరచిన ఈ పాటను సంజిత్‌హెగ్డే, మాళవికా శంకర్ ఆలపించారు. ప్రేమికుల మనసులోని అందమైన భావాలను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. 'ఇదొక సంగీత భరిత ప్రేమకథా చిత్రం. హృద్యమైన కథ, కథనాలతో ఆకట్టుకుంటుంది. ఇటీవల విడుదలైన 'ఉన్నానో లేనో' అనే గీతానికి మంచి ఆదరణ లభిస్తున్నది' అని చిత్ర బృందం పేర్కొంది.



కార్తీక, యష్



## నేను అతనికి కట్టుబడి ఉన్నాను

మనసుకు మాటకు మధ్య ఫిల్టర్ చాలా అవసరం. కానీ దీపిక పదుకోన్‌ను మాత్రం ఈ విషయంలో మినహాయించాలి. తన పద్ధతి వేరు. మనసులో ఏముందో అది స్ట్రెయిట్‌గా బయటకు రావాల్సిందే. మధ్యలో ఫిల్టర్ అంటూ ఉండదు. ఇటీవలే మొదలైన కరణ్‌జోహార్ టాక్ షోలో తన భర్త రణ్‌వీర్ సింగ్‌తో కలిసి పాల్గొన్న దీపిక తన మనసుని పూర్తిగా ఆవిష్కరించేసింది. తన భర్త సాక్షిగానే తన జీవితంలో ఎదుర్కొన్న చాలా విషయాలను వెల్లడించింది. 'రణవీర్‌కి ముందు ఇద్దరితో స్నేహంగా మెలిగాను. కానీ వాళ్లు నా అభిప్రాయాలను అస్సలు గౌరవించలేదు. అందుకే వాళ్ల స్నేహానికి గుడ్‌బాయ్ చెప్పేశాను. ఏ విషయంలోనూ నా పరిధులు దాటలేదు. అసలు రణ్‌వీర్ విషయంలోనూ తను ప్రపోజ్ చేసే వరకూ నేను మౌనంగానే ఉన్నాను. ఈ రోజు మేం ఒకరికోసం ఒకరం బతుకుతున్నాం. ఇప్పటికే వృత్తిరీత్యా నేను చాలామందిని కలుస్తుంటాను. కానీ నా గమ్యం రణ్‌వీర్.. నేను అతనికి కట్టుబడి ఉన్నాను. కలిసి బతకడం అంటే నమ్మకంతో బతకడం' అంటూ చెప్పుకొచ్చింది దీపిక.

## టిల్లు స్క్వేర్ వచ్చేస్తున్నాడు

సిద్ధు జొన్నలగడ్డ బ్లాక్‌బస్టర్ మూవీ 'డిజే టిల్లు'కి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రాబోతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని సిద్ధు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలిసి నిర్మించారు. సిద్ధు జొన్నలగడ్డ కథాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి కథానాయిక అనుపమా పరమేశ్వరన్. ఈ సీక్వెల్ కల్ట్ మూవీగా నిలవడం ఖాయమని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని, మల్లిక్ రామ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం ఫస్ట్ పార్ట్‌ని మించి విజయాన్ని సాధి స్తుందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న సినిమా విడుదల చేస్తామని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా సాయిప్రకాశ్ గుమ్మడిసిం గు, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.





రష్మిక మందన్న, రణ్‌బీర్‌కపూర్

## 'నే వేరే'.. అంటూ సంప్రదాయ హద్దుల్ని దాటి

మొన్నామధ్య సందీప్‌రెడ్డి వంగా 'యానిమల్' సినిమా నుంచి తొలిపాటను విడుదల చేశారు. 'అమ్మాయి..' అంటూ సాగే ఆ పాట జనబాహుళ్యంలో బాగానే వినిపించింది. ఈ శుక్రవారం ఈ సినిమాలోని రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'నే వేరే..' అంటూ సాగే ఈ పాట సందీప్‌రెడ్డి అభిరుచికి నిదర్శనంలా అనిపిస్తుంది. మానవతా విలువలు, మనసుల్ని తాకే అనుభూతులు, వివాహం తర్వాత తలెత్తే సంక్లిష్టమైన విభేదాల నేపథ్యంలో ఈ పాట సాగుతుందని మేకర్స్ చెబుతున్నారు. అనంతశ్రీరామ్ రచించిన ఈ పాటను శ్రేయాస్ పురాణిక్ స్వరపరిచారు. కార్తీక్ ఆలపించాడు. హీరోహీరోయిన్లు రణ్‌బీర్‌కపూర్, రష్మిక మందన్నా అనుబంధ, విభేదాలను ఆవిష్కరించేలా ఈ పాట ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. సంప్రదాయ సరిహద్దులను దాటి, ఆకర్షణీయంగా, ఆలోచింపజేసేలా ఈ పాట చిత్రీకరణ సాగింది. డిసెంబర్ 1న 'యానిమల్' పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.





